# సీమవార్త

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4 మంగళవారం 8 సెప్టెంబర్ 2026


## విశ్వకర్మ లోన్ లకై స్పెషల్ బ్యాంకింగ్..!!

.......పిఎం విశ్వకర్మ రుణాల మంజూరుకు ప్రత్యేక బ్యాంకింగ్ శిబిరాలు

..... పుట్టపర్తి లో....ఎల్డీఎం సి.వి.ఫణీంద్ర కుమార్

పుట్టపర్తి సెప్టెంబర్ 07 సీమ యవార్త.



కెనరా బ్యాంక్, లీడ్ బ్యాంక్, జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్తంగా 'పిఎం విశ్వకర్మ' పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక బ్యాంకింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సి.వి. ఫణీంద్ర కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న, ఉదయం 10:30 గంటలకు, ధర్మవరం మండల మహిళా సమైక్య కార్యాలయంలో , మధ్యాహ్నం 3:30 గంటలకు పెనుగొండ మండలం మహిళా సమైక్య కార్యాలయంలో, ఈ నెల 9న ఉదయం 10:30 గంటలకు, మడకశిర వెలుగు కార్యాలయంలో, మధ్యాహ్నం 3:30 గంటలకు, హిందూపూర్ వెలుగు కార్యాలయంలో, ఈ నెల 10న, ఉదయం 10:30 గంటలకు,కదిరి ఎంపీడీవో కార్యాలయంలో, మధ్యాహ్నం 3:30 గంటలకు,పుట్టపర్తి డిఆర్డిఏ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ శిబిరాలలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని ఎల్డీఎం వివరించారు. లబ్ధిదారులు, చేతివృత్తుల కళాకారులు తమ అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జ్ఞాన ప్రదాత-...అక్షర సేవకుడు

# నిత్య విద్యార్థి





బహుముఖ ప్రజ్ఞాశాలి....

జాబిలి చాంద్ బాషా.

పెనుకొండ సెప్టెంబర్ 7 సీమవార్త.

"ఉపాధ్యాయుడే దేశ భవిష్యత్తుకు నిజమైన రూపశిల్పి." ఆ మాటను ప్రతి నిమిషం ఆచరణలో చూపిస్తూ, ఉపాధ్యాయ వృత్తికి కొత్త అర్థాన్ని నింపిన బహుముఖ ప్రజ్ఞాశాలి జాబిలి చాంద్ బాషా. విద్యారంగంలో అంకితభావం, సాహిత్యంలో అక్షర తపస్సు, సమాజ సేవలో నిరంతర ఆరాటం --- ఈ మూడింటి కలబోతగా జీవిస్తున్న ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతగా, నవసమాజ నిర్మాణానికి తన శక్తినంతటినీ ధారపోస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరుపున సింగపూర్ ఎన్ ఐ ఈ నందు అంతర్జాతీయ విద్యా విధానాలపై అధ్యయనం చేసి నేడు కోగిర గ్రామీణ ప్రాంత పిల్లలకు విద్యాబోధన అందజేస్తున్నారు. విద్యాక్షేత్రంలో - మిగతా3లో






## ఈ నెల 7 నుండి 16 లోపు....

## నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

....అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందడమే ప్రభుత్వ లక్ష్యం

....స్వచ్ఛ గ్రామం / స్వచ్ఛ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ

....జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, సెప్టెంబర్ 07: సీమ వార్త.



శ్రీ సత్యసాయి జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సామాజిక భద్రతా పింఛన్ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ పథకం కింద నూతనంగా అర్హత పొందిన వారి నుంచి సెప్టెంబర్ 7వ తేదీ నుండి 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.వృద్ధాప్యం, వితంతు, దివ్యాంగత్వ, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు తదితర వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబర్ 7 -- 16: నూతన పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ

సెప్టెంబర్ 17 -- 21: సాధారణ అర్హతల పరిశీలన

లిసెప్టెంబర్ 22 -- 24: భౌతిక / శాఖాపరమైన ధృవీకరణ, అర్హత నిర్ధారణ

సెప్టెంబర్ 25 -- 26: సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోదం

మంజూరు: ప్రభుత్వ ఆమోదం అనంతరం దశలవారీగా పంపిణీ

కావలసిన పత్రాలు...

ఆధార్ కార్డు, రైస్ కార్డు, వయస్సు ధృవీకరణ పత్రం, కేటగిరీ ఆధారంగా (వితంతు/దివ్యాంగ/చేనేత/గీత కార్మిక/ఒంటరి మహిళ) ధృవీకరణ పత్రాలు మరియు బ్యాంక్ ఖాతా వివరాలను దరఖాస్తుతో పాటు సమర్పించాల్సి ఉంటుంది.దరఖాస్తుల స్వీకరణ నుండి మంజూరు వరకు ప్రతి దశలోనూ పారదర్శకత పాటిస్తూ, గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులు సెప్టెంబర్ 16 లోపు తమ సమీప స్వచ్ఛ గ్రామం లేదా స్వచ్ఛ వార్డు కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఈ పంట నమోదు 100% పూర్తి చేయాలి..!!

.....జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తరాదు.

....వ్యవసాయ అధికారులు ఈ-పంట నమోదు 100% పూర్తి చేయాలి.

.... జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలి....జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 7 సీమ వార్త.

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆర్డబ్ల్యూఎస్, డ్వామా, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అన్ని మండలాల ఎంపీడీవోలకు మరియు అన్ని సంక్షేమ వసతిగృహాల డిడిలకు సూచించారు. ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకొని జిల్లాలో మంచినీటి - మిగతా3లో

సీమ వార్త
తెలుగు దినపత్రిక

## మంచినీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు...



**గాండ్లపెంట, సెప్టెంబర్ 7 సీమ వార్త....**తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో తలెత్తిన మంచినీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండలంలోని సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, స్థానిక నాయకులతో అధికారులు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని మల్ల మీద పల్లి,కురు మామిడి, గొడ్డు వెలగల, చామలగొంది, సామ చేనుబైలు తదితర గ్రామాల్లో తలెత్తిన మంచినీటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు చర్చించి ప్రణాళిక సిద్ధం చేశారు. ముఖ్యంగా మంచినీటి ఎద్దడి తీవ్రత ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల స్థానిక నాయకులు అధికారులకు విన్నవించారు. అదేవిధంగా బోరు బావుల్లో పైపులు తక్కువగా ఉన్న చోట అదనపు పైపులు ఏర్పాటు, కొత్త బోర్లు తవ్వకం తదితర నివారణ చర్యలు చేపట్టాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో పద్మనాభరెడ్డి, నీటి సరఫరా విభాగం జేఈ కిరణ్ కుమార్ రెడ్డి, ఈఓ ఆర్ డి సునీత, మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు శ్రీరాములు, చిన్నోడు, వెంకటనారాయణ, ఈశ్వర్ రెడ్డి, ఆనంద్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించాలని రోడ్డెక్కిన మహిళలు..

వాహనాల రాకపోకలను అడ్డుకొని నిరసన...

నీటి సమస్యను పరిష్కరిస్తాం.. ఎంపీడీవో




**గాండ్లపెంట, సెప్టెంబర్ 7 సీమ వార్త....** తమ గ్రామంలో తలెత్తిన మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కె. గొల్లపల్లికి చెందిన మహిళలు సోమవారం కటారు పల్లి క్రాస్ వద్దగల కదిరి రాయచోటి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కారు. గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లలో జలం పూర్తిగా అగంటి పోవడంతో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు, ముల్ల కంపలువేసి బస్సుల రాకపోకలను అడ్డుకొని రోడ్డుపై బైఠాయించారు. దాదాపు గంటసేపు మహిళలు రోడ్డుపైనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నెల రోజులుగా గ్రామంలో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో మంచినీటి దాహార్తిని తీర్చేంతవరకు ఇక్కడి నుంచి వెళ్ళేది లేదని మహిళలు భీష్మించి కూర్చున్నారు. అనంత రం ఎంపీడీవో రామకృష్ణ, స్థానిక ఎస్సై సుమతి, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. అదేవిధంగా కటారుపల్లి క్రాస్ లో కూడా తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని ఇక్కడి మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో తలెత్తిన మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు మహిళలకు నచ్చ చెప్పారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఎంపీడీవో మహిళలకు తెలియజేశారు. దీంతో మహిళలు తమ ఆందోళన ను విరమించారు.

## చలనమే జీవనం.. ఆరోగ్యమే భవిష్యత్తు

నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

**పులివెందుల సెప్టెంబర్ 7 (సీమ వార్త):**శారీరక చలనాన్ని పెంపొందించడంలో, నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడంలో ఫిజియోథెరపీ పాత్ర అమూల్యమైనది. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న నిర్వహించే 'ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా, ఆధునిక జీవనశైలిలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం. ?నేటి ఉరుకుల పరుగుల జీవితంలో కంప్యూటర్ల ముందు గంటల తరబడి కూర్చోవడం, శారీరక శ్రమ తగ్గడం వల్ల చాలామందిలో వెన్నునొప్పి, మెడనొప్పి, కీళ్ల నొప్పులు సర్వసాధారణం అయ్యాయి. కేవలం వృద్ధులకే కాకుండా, యువత కూడా ఈ సమస్యల బారిన పడుతున్నారు. ఇలాంటి సందర్భాలలో ఎలాంటి శస్త్రచికిత్సలు లేకుండా, మందుల మీద ఆధారపడకుండా సహజ పద్ధతులతో శరీరాన్ని మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావడంలో ఫిజియోథెరపీ కీలకపాత్ర పోషిస్తుంది. ప్రధాన విశేషాలు: కీళ్ల నొప్పులు, కండరాల బిగువు, పక్షవాతం బాధితులకు పునరావాసం కల్పించడంలో ఫిజియోథెరపిస్టుల సేవలు అద్భుతం. ఎముకల సర్జరీలు, క్రీడా గాయాల తర్వాత రోగులు వేగంగా కోలుకోవ డానికి ఫిజియోథెరపీ తప్పనిసరి. ?నివారణే మార్గం: కేవలం రోగాలొచ్చాక చికిత్స మాత్రమే కాకుండా, భంగిమ సరిగ్గా ఉండేలా చూసుకోవడం ద్వారా దీర్ఘకాలిక నొప్పులను ముందే నివారించవచ్చు. ?ఈ ఏడాది ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకల ద్వారా "ప్రతి ఒక్కరూ శారీరకంగా చురుగ్గా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి" అనే సందేశాన్ని నిపుణులు ఇస్తున్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఫిజియోథెరపిస్టులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. ?ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, నిత్యం వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేద్దాం.




## ఆధునిక ఫీచర్లు, కొత్త ఇంజిన్‌తో మార్కెట్ లోకి పల్సర్ బైకు

ఆయాన్ బజాజ్ షోరూం అధినేత ఇబ్రహీం




**వేంపల్లె, సెప్టెంబర్ 07, సీమవార్త** :బజాజ్ ఆటో సంస్థ తన ప్రసిద్ధ పల్సర్ ద్విచక్ర వాహన శ్రేణిలో కొత్త తరం పల్సర్ 125,150 మోటార్ బైకులు ఆధునిక ఫీచర్లు, కొత్త ఇంజన్ తో మార్కెట్‌లోకి వచ్చినట్లు ఆయాన్ బజాజ్ షోరూం అధినేత డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆయాన్ బజాజ్ షోరూంలో కొత్తగా వచ్చిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ప్రజాశక్తి సీనియర్ జర్నలిస్టు నైనా అబ్దుల్ గఫార్ బాష చేతుల మీదుగా అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయాన్ బజాజ్ షోరూం అధినేత ఇబ్రహీం మాట్లాడుతూ పల్సర్ బ్రాండ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 24న కొత్త మోడళ్లను బజాజ్ మోటర్ బైకు సంస్థ ఆవిష్కరించిందని తెలిపారు. పాత పల్సర్ ప్రత్యేకతలను కొనసాగిస్తూనే ఇంజిన్, గేర్‌బాక్స్, ఛాసిస్, సస్పెన్షన్‌తో పాటు ఆధునిక సాంకేతిక ఫీచర్లను జోడించినట్లు చెప్పారు. కొత్త పల్సర్ 150లో 149.5 సీసీ ఇంజిన్‌ను అమర్చినట్లు తెలిపారు. కొత్త ఇంజిన్, గేర్‌బాక్స్‌తో పాటు కొత్త ఛాసిస్, మోనోషాక్ సస్పెన్షన్ అందించడం ద్వారా రైడింగ్ అనుభూతిని పెరిగిందని తెలిపారు. ఆధునిక మార్పులతో కొత్త పల్సర్ 125లో 124.58 సీసీ ఇంజిన్‌ను ఉన్నట్లు తెలిపారు. 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వచ్చిన ఈ మోడల్‌లో కొత్త డిజైన్, మెరుగైన సస్పెన్షన్, ఆధునిక ఎలక్ట్రానిక్ ఫీచర్లు ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేక ఆకర్షణ కలిగిన కొత్త పల్సర్ మోడళ్లలో 5 అంగుళాల టిఎఫ్ టి కన్సోల్, గూగుల్ మ్యాప్స్ నావిగేషన్ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కొత్త లుక్‌తో స్పోర్టీ డిజైన్, కొత్త పల్సర్ మోడళ్లలో షార్ప్‌గా కనిపించే కొత్త హెడ్‌ల్యాంప్, మసిల్యులర్ ఫ్యూయల్ ట్యాంక్, కొత్త ట్యాంక్ ఎక్స్‌టెన్షన్స్, రీడిజైన్ చేసిన సైడ్ ప్యానెల్స్, స్లీక్ టెయిల్ సెక్షన్ వంటి మార్పులు చేసినట్లు చెప్పారు. .యువతను ఆకట్టుకునే స్పోర్టీ లుక్‌తో పాటు మెరుగైన రైడింగ్ అనుభూతిని అందించేలా కొత్త పల్సర్ మోడళ్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆయాన్ బజాజ్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

## ఝురికోన ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలి



**టి సుండుపల్లె సెప్టెంబర్ 7సీమ వార్త** అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు జనసేన పార్టీ సీనియర్ నేత రామా శ్రీనివాస్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రశీ సమర్పించారు. ఝురికోన ప్రాజెక్టు తూము నుంచి బహుదా నదిలోకి నీటిని విడుదల చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే రాయచోటి నుంచి సుండుపల్లి మీదుగా రాజంపేట వెళ్లే మార్గంలో సానిపాయి వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అటవీ శాఖ అనుమతులను అధికారికంగా మంజూరు చేయించి రెండు వరుసల రహదారి నిర్మాణానికి అన్ని విధాలా సహకరించాలని కలెక్టర్‌ను కోరినట్లు రామా శ్రీనివాస్ తెలిపారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం



**యాడికి సెప్టెంబర్ 07 ( సీమ వార్త )** యాడికి మండలంకేంద్రం లోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కీ"శే"బాల నరసింహులు(లక్ష్మీ ప్రియ థియేటర్) 7వ వర్ధంతి జ్ఞాపకార్థమై అన్నదానం ఏర్పాటు చేశారు యాడికిలో లక్ష్మీ థియేటర్ ఓనర్ అయిన కీ"శే"బాల నరసింహులు గారు చనిపోయి 7 సంవత్సరాలు పూర్తి కావడంతో ఆయన వర్ధంతిని జ్ఞాపకం చేసుకుంటూ ఆయన భార్య బాల రమాదేవి వారి కుమారుడు బాల కృష్ణ చైతన్య, కోడలు కల్పన మనవరాళ్ళు లాస్యశ్రీ, సుమశ్రీ కుటుంబం వారు ఆయన మీద ఉన్న ప్రేమను బట్టి ఆయన కుమారుడు కృష్ణ చైతన్య ఆశ్రమంలోని పెద్దలను తల్లిదండ్రులుగా భావించి వారిని సంతోష పరచాలని అగాపే ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు నిరాశ్రయులకు ఉదయకాలము మరియు మధ్యాహ్న కాలము మంచి భోజనాలు ఏర్పాటు చేయించి అన్నదానం చేశారు ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబం అంతటికి ధన్యవాదాలు తెలిపారు.

## నూతన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**మడకశిర సెప్టెంబర్ 7 సీమ వార్త** నూతన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కర్ణాటక రాష్ట్రం పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఆదర్శ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గుండుమల చంద్రప్ప . సోమవారం కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా ఏ. ఆర్. రొప్పం సమీపంలో పావగడ మాజీ శాసనసభ్యులు తిమ్మరాయప్ప నూతన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి సోదరుడు గుండుమల గ్రామపంచాయతీ ఆశా కిరణం, అణగారిన వర్గాల ఆపద్బాంధవుడు గుండమల చంద్రప్ప , జెడిఎస్ నాయకుడు న్యాయదగుంటే ఎన్ ఏ ఇంకేం పెడతా రా ఈరన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

## గోపాలుడి నామస్మరణతో మార్మోగిన గొల్లహట్టిలు

భక్తి పారవశ్యం. ఆధ్యాత్మిక సందడి. శ్రీకృష్ణుని నామస్మరణతో పులకించిన గ్రామాలు!



**మడకశిర సెప్టెంబర్ 7 సీమ వార్త నియోజకవర్గ పరిధిలోని** అగళి మండలం మధుడి గొల్లహట్టి, అమరాపురం మండలం చిట్టనడుకు గొల్లహట్టి గ్రామాల్లో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి శ్రీకృష్ణుని ఆశీస్సులు అందుకుని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ధర్మాన్ని కాపాడుతూ... ప్రజల సంక్షేమం కోసం ముందుకు సాగుదాం" అనే శ్రీకృష్ణుని సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో నిరంతరం ముందుకు సాగుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, జయప్ప, కెంచ్చు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులకుజరిమానా



**అమరాపురం సెప్టెంబర్ 6 సీమవార్త** అమరాపురం పోలీసు స్టేషన్ పరిధి లో మద్యం సేవించి బొలెరో పికప్ ఫోర్ వీలర్ ను నడిపిన అమరాపురం మండలం, ఉదు గూరు గ్రామానికి చెందిన షణ్ముఖ మరియు నిద్రగట్ట గ్రామానికి చెందిన టూ వీలర్ ను నడిపిన లోకేష్ అను వారికి డ్రింక్ అండ్ డ్రైవ్ క్రింద కేసులు నమోదు చేసి, వారిని ఈ దినం రాజశ్రీ మడకశిర జీఖీజవీ కోర్టు వారి మందు హాజరు పరచగా జడ్జి గారు ఒక్కొక్కరికి రూ. 10,000వంతున రూపాయలు చొప్పున ఇద్దరు వ్యక్తులకు రూ. 20,000 జరిమానా విధించారు. కావున మండల ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడుపరాదు అని తెలిపారు.

## కేసీఆర్ గారూ..అమ్మకు, ఆడబిడ్డకు,దళితులకు మీ పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా?

...... డి ఎచ్ పి ఎస్ సూటి ప్రశ్న.



**మడకశిర సెప్టెంబర్ 7 సీమ వార్త** దళితుడు, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించినట్లు వెలువడిన వ్యాఖ్యలను దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్. హనుమంతు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ పదవిలో ఉన్న స్పీకర్‌ను కులపరమైన అవమానకర పదజాలంతో దూషించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయి. వ్యక్తిగతంగా, కులపరంగా అవమానించే స్థాయికి రాజకీయ భాష దిగజారడం ప్రజాస్వామ్యానికే అవమానం.కేసీఆర్ గారూ.. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, దళిత సంక్షేమం అంటూ ప్రజలను నమ్మించిన మీ పార్టీ నాయకులు ఇప్పుడు దళితుడైన స్పీకర్‌ను అవమానిస్తుంటే మీరు ఎందుకు స్పందించడం లేదు? తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది. దళితుల పట్ల మీ పార్టీకి నిజమైన గౌరవం ఉంటే, ఇలాంటి వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించి, బాధ్యులపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారనే ప్రజల అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది. అదేవిధంగా మహిళల పట్ల గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, రాజకీయ సంస్కారం గురించి మాట్లాడే నైతిక హక్కు కూడా మీ పార్టీ నాయకత్వం ముందుగా తన నాయకుల భాషను, ప్రవర్తనను సమీక్షించుకున్నప్పుడే ఉంటుంది. దళితులను అవమానిస్తే సహించేది లేదు. మహిళలను అవమానిస్తే సహించేది లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. తెలంగాణలో దళితులు, మహిళలు, సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు తమ ఓటుతో ఎవరు గౌరవం ఇచ్చారు, ఎవరు అవమానించారు, ఎవరు మాట నిలబెట్టుకున్నారు, ఎవరు మోసం చేశారు అన్నదానికి తగిన సమాధానం చెప్పడం ఖాయం. రాజకీయ భాషలో సంస్కారం ఉండాలి..ప్రజా జీవితంలో బాధ్యత ఉండాలి..దళితుల పట్ల గౌరవం ఉండాలి.ఇవి పాటించలేని రాజకీయ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు అని తెలిపారు.

మంగళవారం 8 సెప్టెంబర్ 2026
సీమ వార్త

## ఉత్తమ అధ్యాపకునికి సన్మానం



**పెనుకొండ సెప్టెంబర్ 7 సీమవార్త.** జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దస్తగిరి ని సోమవారం సీనియర్ ఉపాధ్యాయులు వి. రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి దగ్గర విద్యాభ్యాసం చేసిన పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు గా వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణానాయక్, రామచంద్రప్ప, చంద్ర, విజయ లక్ష్మి, ఏ పి టి ఫ్ మండల శాఖ అధ్యక్షులు శివన్న, సీనియర్ నాయకులు నాగ చంద్ర శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటిని వృధా చేయకూడదని యాడికి మండల ప్రజలకు విజ్ఞప్తి

అవసరమైన మేరకు మాత్రమే నీటిని ఉపయోగించుకోవాలని యాడికి మండల ప్రజలకు తెలియజేసిన ఎంపీడీవో వీర్రాజు



**యాడికి సెప్టెంబర్ 07 ( సీమ వార్త )** ఎల్‌నినో ప్రభావం కారణంగా తగినంత వర్షాలు పడకపోవడంతో బోరుబావుల్లో నీటి మట్టాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి కావున ప్రజలందరూ నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది లేనిపక్షంలో రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించి నీటి సంరక్షణకు సహకరించగలరు మండల ప్రజలకు తెలియజేసిన చేసిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి

## మీటర్ రీడర్స్ కు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి.

సిపిఐ పట్టణ కార్యదర్శి పూల శెట్టి రవికుమార్.



**ధర్మవరం సెక్టెంబర్ 07,సీమ వార్త ;** మీటర్ రీడర్స్ కు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పూల శెట్టి రవికుమార్ మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఏ ఐ టి యు సి, జిల్లా నాయకులు కిరణ్ కుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గుర్రం వెంకటస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీ సత్య సాయి జిల్లా లోని ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ మీటర్ రీడర్స్ గా పని చెస్తున్న కార్మికుల కు కాంట్రాక్టర్ సరిగా జీతాలు చెల్లించడం లేదు అని. యస్ ఈ , కలెక్టర్ లకు పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది అని, కానీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అందుకు కాంట్రాక్టర్ ప్రతి నేల 5 వ తెదిన ఖచ్చితంగా వేతానాలు చెల్లిస్తాని హామీ ఇచ్చారని, అలా కాకుండా రెండు నెలలకు ఒక సారి ఒక నేల వెతనం చెల్లిస్తున్నారు అని మండిపడ్డారు. కానీ ఇప్పుడు 10 వ తేదీ పైన ఇస్తానని అంటున్నారు అని, వారి కుటుంబాలు ఎలా జీవించాలని వారు ప్రశ్నించారు. విద్యుత్ మీటర్ రీడర్స్ ఇచ్చే జీతాలే తక్కువ మరి నెలల తరబడి పెండింగ్ పెడితే వారి కుటుంబ పోషణ కూడా చాలా ఇబ్బందికరంగా మారుతుంది అని తెలిపారు. గత 3 నెలలు గా జీతాలు పెండింగ్ పెట్టడం తో కార్మికులు చాలా తీవ్ర ఇబ్బందులు కి గురి అవుతున్నారు. అందుకే వెంటనే కార్మికులు ల కు జీతాలు చెల్లించాలని జిల్లా మీటర్ రీడర్స్ కమిటీ సభ్యులు అందరూ కలిసి ఈ అర్ ఒ ఆఫిస్ ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మా సమస్యలు పరిష్కారం కానీ ఎడల ఎస్సీ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కొండయ్య, బాబావాలి, శివానంద, ఆదర్శ్ కుమార్, అశ్వర్ధ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## చేపలు వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**టి సుండుపల్లె సెప్టెంబర్ 7 సీమ వార్త** మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం హరిజనవాడ(మాలపల్లి)కు చెంది న మల్లేపల్లి ప్రదీప్ కుమార్ కూమారుడు సతీష్ కుమార్ (31 సం)లు ఆదివారం సాయంత్రం గాలంతో చేపలు పట్టుకోవ డానికి ఊటచెరువు దగ్గరకు వెళ్లి చేపలు పడుతూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతుడికి ఈత రాదని కుటుంబ సభ్యులు తెలియజేసారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

# ధర్మవరం జాబ్ మేళాకు సర్వం సిద్ధం.

ఉద్యోగ అవకాశాలతో ముస్తాబైన మెగా జాబ్ మేళా.

మంత్రి ప్రత్యేక చొరవతో నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం.

గత జాబ్ మేళాలో 2 వేల మందికి పైగా ఉద్యోగాలు.

ఈసారి అంతకుమించి భారీగా నిర్వహణ.



**ధర్మవరం, సెప్టెంబర్ 07 సీమ వార్త :** ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, ప్రత్యేక చొరవతో రేపు (సెప్టెంబర్ 8, మంగళవారం) ధర్మవరంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సర్వం సిద్ధమైందని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళా కోసం ధర్మవరంలోని సి ఎన్ బి ఫంక్షన్ హాల్, బత్తలపల్లి రోడ్డులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హరీష్ బాబు వివరించారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఉండకూడదు, ప్రతి యువకుడు, యువతి తన విద్యార్హతకు, నైపుణ్యానికి తగిన ఉద్యోగాన్ని సాధించాలి అనే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ జాబ్ మేళాల నిర్వహణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని వివరించారు. ఉద్యోగాల కోసం యువత ఇతర ప్రాంతాలకు వెళ్లి కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రముఖ కంపెనీలను ధర్మవరానికే తీసుకువచ్చి ఒకే వేదికపై భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ మెగా జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని హరీష్ బాబు పేర్కొన్నారు. 2025 జనవరి 9న ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 5 వేల మందికి పైగా యువతీ యువకులు హాజరయ్యారని, అందులో 2 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు పొందారని హరీష్ బాబు తెలిపారు. గత జాబ్ మేళాకు యువత నుంచి వచ్చిన అపూర్వ స్పందన, వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించిన నేపథ్యంలో, అదే స్ఫూర్తితో ఈసారి నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను మరింత భారీ స్థాయిలో, మరిన్ని కంపెనీలు మరియు విస్తృత ఉద్యోగ అవకాశాలతో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. గత జాబ్ మేళా ధర్మవరం యువతకు మంచి ఫలితాలను అందించింది. అదే స్ఫూర్తితో ఈసారి అంతకంటే మరింత అద్భుతంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నాం. యువత పెద్ద సంఖ్యలో హాజరై తమకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి అని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో 100కు పైగా ప్రముఖ జాతీయ, బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నాయని హరీష్ బాబు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు నేరుగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హత కలిగిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారని వివరించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీ.ఫార్మసీ, డీ.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, ఉద్యోగ స్వభావాన్ని బట్టి వివిధ కంపెనీలలో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు నెలవారీ వేతన అవకాశాలు ఉన్నాయని హరీష్ బాబు వివరించారు. ఈ మెగా జాబ్ మేళాకు మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని హరీష్ బాబు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్తులో అందుబాటులో ఉన్న అవకాశాలపై మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తదితర అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగానే నైపుణ్యం పోర్టల్ ద్వారా లేదా పోస్టర్‌లోని ~= కోడ్‌ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రెండోసారి ఇంత భారీ స్థాయిలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. గతంలో 5 వేల మందికి పైగా యువత హాజరై, 2 వేల మందికి పైగా ఉద్యోగాలు పొందారు. ఈసారి అంతకంటే ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కాబట్టి ధర్మవరం నియోజకవర్గంతో పాటు సమీప ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని నియోజకవర్గ ఇంచార్జి హరీష్ బాబు విజ్ఞప్తి చేశారు.

# సామాన్యుడిపై ధరల పిడుగు

-పేదోడి వంటింటిపై ధరల భారం

-మార్కెట్ కు వెళ్లాలంటేనే జంకుతున్న ప్రజలు

- నియంత్రణపై ప్రభుత్వాల నిర్లక్ష్యమంటూ విమర్శలు



**పులివెందుల సెప్టెంబర్ 7 (సీమ వార్త):** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యుడి జీవనం భారంగా మారుతోంది. ఒకవైపు ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉండగా.. మరోవైపు నిత్యావసరాల ధరలు మాత్రం అదుపు లేకుండా పెరుగుతున్నాయి. గత ఏడాది ఉన్న ధరతో పోలిస్తే ఈ ఏడాది అనేక వస్తువుల ధరలు రెట్టింపయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో నెలవారీ కుటుంబ బడ్జెట్‌ను సమతూకం చేసుకోవడం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు కత్తిమీద సాములా మారింది. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవి అన్న చందంగా ధరలు వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మార్కెట్‌కు రూ.100 తీసుకెళ్లినా ఒక పూటకు సరిపడా కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఒకసారి ఏదైనా వస్తువు ధర పెరిగితే తిరిగి తగ్గడం అరుదుగా మారింది. దీంతో పెరుగుతున్న ధరల భారం నేరుగా సామాన్యుడి వంటింటిపై పడుతోంది. వర్షాభావంతో కూరగాయల సాగుకు దెబ్బ: వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, వర్షాభావ పరిస్థితులు కూడా కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తడంతో కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగునీటి వసతి ఉన్న రైతులు పంట సాగు చేయాలన్నా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, నీటి ఖర్చులతో పెట్టుబడి భారంగా మారుతోంది. అయితే పంట చేతికొచ్చే సమయానికి రైతుకు గిట్టుబాటు ధర లభించక నష్టపోవాల్సి వస్తోంది. మరోవైపు పంట ఉత్పత్తి తగ్గినప్పుడు మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరిగి వినియోగదారులపై భారం పడుతోంది. పంట ఉన్నప్పుడు ధర ఉండదు.. ధర ఉన్నప్పుడు పంట ఉండదు అన్న నానుడి కూరగాయల రైతుల పరిస్థితికి అద్దం పడుతోంది. మధ్యలో దళారీల దందా..భారమంతా వినియోగదారుడిపైనే రైతు నుంచి వినియోగదారుడి చేతికి చేరేలోపు కూరగాయల ధరలు పలుమార్లు పెరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రవాణా, నిల్వ, మార్కెట్ ఖర్చులతో పాటు మధ్యవర్తుల పాత్ర కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుకు లభించే ధరకు, మార్కెట్‌లో వినియోగదారుడు చెల్లించే ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఉల్లి ధర గుర్తు చేస్తున్న గతం: గతంలో ఉల్లి ధరలు ఆకాశాన్నంటిన సందర్భాలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ఉల్లి ధరల పెరుగుదల ప్రభుత్వాలనే కుదిపేసిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు రాజకీయంగా కూడా ఎంతటి ప్రభావాన్ని చూపగలవో అప్పట్లో స్పష్టమైంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడటంతో పాటు వినియోగదారుడికి కూడా సరసమైన ధరకు కూరగాయలు అందేలా పటిష్టమైన మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఆచరణలో ఫలితాలు కనిపించేలా చర్యలు చేపట్టాలని సామాన్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ధరల మంట ఇలాగే కొనసాగితే వంటింటి పొయ్యి వెలిగించడం కూడా సామాన్యుడికి భారమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమును సద్వినియోగం చేసుకోండి..

రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ .



**ధర్మవరం సెక్టెంబర్ 07,సీమ వార్త ;**ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా గల కోట మున్సిపల్ పాఠశాల యందు సెప్టెంబర్ 13 వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమును నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి పెద్దారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, క్యాంపు చైర్మన్ సత్రశాల ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని సాంస్కృతిక మండలి లో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ శిబిరం రోటరీ క్లబ్ ధర్మవరం, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా ఆందోత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు రెడ్డిపల్లి సుబ్బమ్మ, కీర్తిశేషులు రెడ్డిపల్లి రామప్ప జ్ఞాపకార్థం వీరి కోడలు, వీరి కుమారుడు రెడ్డిపల్లి రాజేశ్వరి రెడ్డి పల్లి రామచంద్రలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ శిబిరం పూర్తిగా ఉచితము అని వారు స్పష్టం చేశారు. కంటి నిపుణుల సలహాలతో కళ్ళలలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. కంటి ఆపరేషన్లు శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు నందు నిర్వహిస్తామని, ఉచిత వశతి, ఉచిత రవాణా, ఉచిత ఆపరేషన్లు, ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రతినెలా నాలుగవ ఆదివారం ధర్మవరంలోని ఎస్బిఐ కాలనీలోమధు కంటి ఆసుపత్రిలో డాక్టర్ సంకారపు నర్సింహులు వద్ద షుగర్ పేషెంట్లకు కంటి పరీక్షలు నిర్వహించి, తగిన సూచనలు కూడా ఇవ్వబడుతుందని తెలిపారు. కావున కంటి పరీక్షలు నిర్వహించుకునేవారు రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డులలో ఏదైనా రెండు జిరాక్స్ కాఫీలు మూడు ఫోటోలు తప్పకుండా తీసుకొని రావాలని తెలిపారు. అంతేకాకుండా బీపీ షుగర్ ఉన్నవారు పరీక్షలు నిర్వహించుకుని తగ్గిన తర్వాత రావాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సోలిగాళ్ళ వెంకటేశులు, బండారు వెంకటాచలం, నాగభూషణ, బుగ్గ ప్రేమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.ాఖ

## డప్పు, చర్మకారుల పెన్షన్ ను సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా ఇచ్చి, పెన్షన్ నమోదు గడువును పెంచాలి.



**మడకశిర సెప్టెంబర్ 7 సీమ వార్త** డప్పు చర్మకారుల పెన్షన్ను సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా ఇచ్చి పెన్షన్ నమోదు గడువు పెంచాలని, దళితులపై చిన్న చూపు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బహుజన్ సమాజ్ పార్టీ మడకశిర అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు బి.రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల మూడు నెలల కాలం అనంతరం మొదటిసారిగా సామాజిక పెన్షన్లను విడుదల చేసిందని, మూడు సంవత్సరాలుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఊరట కలిగినట్లు అనిపించినా.. పెన్షన్ దరఖాస్తు ప్రక్రియలో ఉన్న ఇబ్బందులు వారిని ఇరకాటంలో పెట్టే విధంగా ఉన్నాయని బహుజన సమాజ్ పార్టీ మడకశిర యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు బి.రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షన్ విడుదలకు ముందే దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన ఆటంకాలు లేకుండా నిబంధనలను రూపొందించి ఉండాల్సిందన్నారు. డప్పు కళాకారులు చర్మకారులకు సంబంధించి పెన్షన్ దరఖాస్తుకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన అవగాహన లేని, పొంతనలేని నిబంధనగా అభివర్ణించారు. ఇప్పటిదాకా ఆ డిపార్ట్మెంట్ కు సర్టిఫికెట్ ఇవ్వాలన్న విషయాన్ని తెలియజేయకుండా, ఇస్తే ఎలా ఇవ్వాల్లో, తీసుకునే దళిత వృత్తిదారులు ఎలా తెచ్చుకోవాలో తెలియకుండా నిబంధన పెట్టడం దళిత వృత్తిదారుల పట్ల వివక్ష చూపడమే అన్నారు. గతంలో మాదిరే డప్పు మరియు చర్మకారులకు స్వీయ ధ్రువీకరణ ద్వారా పెన్షన్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడవ తారీఖున ప్రారంభమవుతున్న ఈ పెన్షన్ నమోదు ప్రక్రియ 16 నాటికి ముగించడం అనేది దుర్మార్గమని 12, 13, 14 మూడు రోజులపాటు సెలవులకు పోగా ఇచ్చిన గడువులో ఐదు రోజులు మాత్రమే మిగిలి ఈ ఐదు రోజుల్లో ఇచ్చిన అన్ని రకాల ధ్రువపత్రాలను పొంది ఎలా ఆన్లైన్ చేయించుకుంటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇంటి పన్నుకు సంబంధించిన రసీదు కూడా పెన్షన్ దారులు ఇవ్వాలని కోరడం కొత్తగ ఉందన్నారు. అవసరమైన నిబంధనలు మాత్రమే పెట్టి, సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించి, నమోదు ప్రక్రియను సెప్టెంబర్ చివరి దాకా కొనసాగించి, అర్హులైన అందరికీ పెన్షన్స్ సదుపాయం కల్పించాలన్నారు.

## కొత్త పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**ఈ నెల 16న చివరి తేదీ**

**స్వర్ణ వార్డు కేంద్రాల్లో స్వీకరణ**


**ఓబులదేవరచెరువు (ఆగస్టు8)సీమవార్త:** అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు,వితంతువులు ఒంటరి మహిళలు,ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజాగా దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాలలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓబుల దేవర చెరువు ఎంపీడీవో శివరాం ప్రసాద్ రెడ్డి సోమవారం తెలియజేశారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు,రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత పెన్షన్ కేటగిరీకి సంబంధించిన దృవ ప్రతాలను అర్హత కలిగిన వారు సచివాలయాల్లో అందజేయాలని ఆయన తెలిపారు. అధికారులు దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసి ఈకేవైసీ నిర్వహించడంతోపాటు అర్హతలను పరిశీలిస్తారన్నారు. అనంతరం అర్హులైన దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి భౌతికంగా పరిశీలన నిర్వహించి పత్రాలు అర్హతలను తనిఖీ చేస్తారన్నారు. వృద్ధాప్య వితంతువు ఒంటరి మహిళలు వికలాంగులు చేనేత కార్మికులు మత్స్యకారులు,డప్పు కళాకారులు, సాంప్రదాయ చెప్పులు తయారీదారులు,ట్రాన్స్ జెండర్లు,కల్లుగీత కార్మికులు తదితర అర్హత కలిగిన వర్గాల వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలను అందజేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం కొత్త పింఛన్ దరఖాస్తుల ప్రక్రియలో ప్రతి దశకు స్పష్టమైన గడువు నిర్ణయించిందని ఆయన తెలిపారు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఆన్లైన్ నమోదు,ఈ కేవైసీ ధృవీకరణ, సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు సాధారణ అర్హత పరిశీలన ఉంటుందన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు భౌతిక,శాఖాపరమైన ధ్రువీకరణ,అర్హత నిర్ణయం,సిఫార్సు ఉంటాయి అన్నారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తి అయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు అవుతాయన్నారు.

## కర్నూల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో.... గోరంట్ల కరాటే విద్యార్థుల ప్రతిభ



**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త** జి కే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 13 వ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ కర్నూల్ లో ని పెద్దపాడు పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్ లో కివ్ మరియు ఏపీ కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీ కీర్తన్ కొండూరు ముఖ్య అతిథి గా ప్రారంభించబడి ఆదివారం రాత్రి 10 గం ల వరకు జరిగిన ఈ టోర్నమెంట్ లో... గోరంట్ల నుండి కరాటే మాస్టర్ సెన్సాయి రాజేష్ కుమార్ ద్వారా శిక్షణ పొందిన వారిలో 20మంది ఈవెంట్స్ లో పార్టిసిపేట్ చేయగా అందులో కుమితే(ఫైట్) లో సాయి కార్తీక్ గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ తన్విష్ బ్రాంజ్ మెడల్స్ హస్వీక, అయాన్ , సమర్,హృదిత్య రిషి యోగ్, పూర్వజ్ లు సాధించగా కటా(స్టైల్) విభాగం లో వివిధ కేటగిరీ లలో గోల్డ్ మెడల్ హరికృష్ణ హస్వీకా కుందన, రూప శ్రీ,,ప్రవస్థి సౌబాన్,రిషి కిరణ్, సిల్వర్ మెడల్ సాయి కార్తీక్, రియాన్, బ్రాంజ్ మెడల్ ఖాద్రి చౌదరి, షహన్ షా,సమర్ శీర్వి,తరుణ్, అయ్యాన్, సాధించగా వివిధ విభాగాలలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ బ్రాంజ్ మెడల్ పొందిన ఈ కార్యక్రమంలో సీనియర్ సెన్సాయి అరీఫా పాల్గొన్నారని వీరందరి విజయానికి చాలా సహకారం అందించిన ఎస్ పి వి ఎం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రిన్సిపాల్ శ్రీ భక్త వత్సలం ప్రత్యేకంగా విజేతలకు అభినందనలు అందజేశారని గోరంట్ల గోన్షిరో కరాటే అకాడమీ నిర్వాహకులు త్రివిక్రమ్ తెలిపారు

## మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట రామరెడ్డి గుండె పోటుతో మృతి



**రొద్దం సెప్టెంబర్ 07(సీమవార్త)** మండలములోని గోని మేకలపల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మరియు మాజీ సర్పంచ్, టీ డీ పీ సీనియర్ నాయకులు వెంకట రామరెడ్డి సోమవారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందినట్లు మండల తెలుగుదేశ ము పార్టీ నాయకులు తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి తో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థ సారథి కుడా ఈ విషయం తెలుసు కన్నీటి పర్యాంతమయ్యారు అని పార్టీ కార్యాలయం నుండి తెలిపారు.

## బుక్ చేసిన 25 రోజులకే గ్యాస్ అందిస్తాం

**డీసీ లోకేష్**



**సోమందేపల్లి సెప్టెంబర్ 7 సీమ వార్త** మండల వ్యాప్తంగా హెచ్ పీ గ్యాస్ వినియోగదారులకు నేటి నుంచి 25 రోజులకే గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చని మంజునాథ్ హెచ్ పీ గ్యాస్ గ్రామీణ విక్రత్ యజమాని డీసీ లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్యాస్ బుక్ చేసిన 45 రోజులకి గ్యాస్ ఇచ్చేవారమని, నేటి నుండి 25 రోజులకు గ్యాస్ అందించాలని ఉన్నత అధికారులు తెలిపారన్నారు.

## పోలీస్ కేసులకు రాజీ మార్గం - 12న లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

**వాదులు, ప్రతివాదులు ముందుకు రావాలని రూరల్ సీఐ నారాయణ రెడ్డి పిలుపు**



**తాడిపత్రి, సెప్టెంబర్ 7 సీమ వార్త:** ఈ నెల 12వ తేదీన న్యాయస్థానంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తాడిపత్రి రూరల్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన పలు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులు: చిన్నచిన్న గొడవలకు సంబంధించిన కేసులు, యాక్సిడెంట్ కేసులు, ఎక్సైజ్ కేసులు చీటింగ్ కేసులు, భార్యా భర్తల గొడవలకు సంబంధించిన కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు పై కేసులలోని వాదులు, ప్రతివాదులు ఇరువురు గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించి రాజీ మార్గంలో తమ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించేందుకు మంగళవారం నుంచి తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వాదులు, ప్రతివాదులు 12వ తేదీ వరకు వేచి ఉండకుండా రేపటి నుంచే పోలీస్ స్టేషన్ ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సీఐ తెలియజేశారు.

## పులేరు వైసిపి కార్యకర్త కుటుంబానికి రూ, 10 వేల ఆర్థిక సహాయం.

**.... మానవత్వం చాటుకున్న వైసిపి నేత సురేష్ రెడ్డి.**



**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త** గోరంట్ల మండలంలోని పులేరు గ్రామానికి చేశీదిన వైస్సార్సీపీ కార్యకర్త నారాయణప్ప ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబానికి అండగా అధినేత ఉషశ్రీ చరణ్ సూచన మేరకు వైఎస్ఆర్సీపి మండల నాయకులు సురేష్ రెడ్డి ఆ కుటుంబానికి అండగా నిలబడుతూ ఆర్థిక సాయం అందజేసి తన మానవత్వాన్ని స్వగ్రామంలోని పార్టీ కార్యకర్తల పై ఉన్న మమకారాన్ని చాటుకున్నాడు. నారాయణప్ప మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న పెనుకొండ నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ వారి కుటుంబానికి ప్రగడా సానుభూతి తెలిపారు. వైసీపీ యువ నాయకులు పెనుకొండ నియోజకవర్గ వైస్సార్సీపీ ఆర్ టి ఐ విభాగ అధ్యక్షుడు సురేష్ రెడ్డి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ రెడ్డి , మిలటరీ బాష భాస్కర్ రెడ్డి మరియు జనరశిరెడ్డి పాల్గొన్నారు

## సిద్ధమైన రిసర్వే బుక్కులు పంపిణీ చేస్తాం.

**.... 8 న వడిగేపల్లి రైతులకు అందజేత..... తాసిల్దార్ మధు నాయక్ వెల్లడి.**



**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త** గోరంట్ల మండలంలోని వడిగేపల్లి గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తయిన సందర్భంగా, భూ యజమానులకు నూతన పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం ఈనెల 8న వడిగేపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించబడు తుందని తాసిల్దార్ మధు నాయక్ పేర్కొన్నారు. .రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు మరియు భూ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నవీకరించిన భూ రికార్డులను రూపొందించడం జరిగింది. రీసర్వే పూర్తి కావడంతో భూ యజమానులకు వారి భూములకు సంబంధించిన నూతన రికార్డులు అందు బాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా అర్హులైన భూ యజమానులకు నూతన పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేయనున్నారు. రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత సేవలు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొననున్నారు.

## సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ రద్దు చేయండి.



**పెనుకొండ సెప్టెంబర్ 7 సీమవార్త.** సచివాలయ ఉద్యగుల రేషనలైజేషన్ రద్దు చేసి సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సచివాలయం ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఏ ఎస్ స్కీం ను వెంటనే అమలు చేయాలన్నారు. రేషనలైజేషన్ ను రద్దు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రమోషన్, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అనంతరం కమీషనర్ సతీష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.

## స్థానిక, మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

**ఎరుకల ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతి**

**హిందూపురంలో వార్డులు పెరిగినా ఎస్టీ సీట్లు తగ్గాయని ఆవేదన**

**న్యాయం జరగకుంటే కోర్టుకెళ్తామన్న వైపీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల సురేష్**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 7 (సీమవార్త బ్యూరో) :**స్థానిక, మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల సురేష్ హెచ్చరించారు. పుట్టపర్తి పట్టణంలోని ప్రశాంతి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న రెవెన్యూ భవన్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో ఆయన ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ...శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం, మడకశిర, పెనుకొండ మున్సిపాలిటీల్లో ఎస్టీలకు ఏదో ఒక సీటు కేటాయిస్తున్నారే తప్ప రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కేటాయించడం లేదని, ఇది ఎస్టీలకు తీవ్ర అన్యాయమని అన్నారు. 1987-92 మధ్య హిందూపురం మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా ఎస్టీలకు 2 సీట్లు ఇచ్చారని, వార్డులు 38కి పెరిగినప్పుడు 1 సీటుకే కుదించారని, వార్డులు, జనాభా పెరుగుతున్నా సీట్లు పెరగకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో హిందూపురం పరిధిలోని బోయపేట, త్యాగరాజు నగర్, లక్ష్మీపురం, ఆర్టీసీ కాలనీ వార్డులను ఎస్టీలకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైపీపీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిజిలి గంగులప్ప, జిల్లా నాయకులు రామచంద్ర, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## హిందూపురం, కలిపి,రొద్దం కు ఏ పీ యస్ ఆర్ టీ సీ బస్ లు పునరుద్ధరించండి...

**విద్యార్థులు, రోజుకూలీలు, పేషంట్లు , ప్రయాణీకులు , తదితరులు**

**హిందూపురంపోవాలంటే తీవ్ర ఇబ్బందులు....**

**ఆర్ టీ సీ కీ కుడా రోజు నిత్యం ఆధాయానికి గండి...**

**మరో రోడ్ నుండి అయినా సర్వేసులు నడిపించి ప్రజలు సమస్యను పరిష్కరించాలని సంబంధించిన అధికారులను కోరిన ప్రేయణీకులు, విద్యార్థులు...**



**రొద్దం సెప్టెంబర్ 07(సీమవార్త)** మండల కేంద్రానికి హిందూపురం నుండి నిత్యం రెండు సర్వీస్ లు ఒక్కో సర్వీస్ ఆరు సింగల్ తో రెండు సర్వీసులు కలిసి ఏ 12సింగల్స్ తిరిగేవి. రోజు కలెక్షన్లు వారి టార్గెట్ కంటే ఎక్కువగా తీసుకెళ్ళేవి అని సమాచారం. అదేవిధంగా హిందూపురం నుండి నల్లూరు కీ ఆరు సింగల్ వచ్చేది. ఈ మూడు సర్వేసులు నుండి వందలదిమంది ప్రయాణీకులు, విద్యార్థులు, పేషంట్లు, రోజుకూలీలు, ఇలా ప్రయానించే వారు. కానీ ప్రస్తుతము కే. మరువపల్లి సమీపములోని బ్రిడ్జి పైన, మరియు కే. మరువపల్లి, భూధిపల్లి, పీ. రొప్పాలా దగ్గర ఆ రోడ్డు పై సీసీ రోడ్డు వేయడముతో ఉన్న మూడు బస్ లు ను ఆర్ టీ సీ అధికారులు నిలబెట్టడముతోవందలాది మంది ప్రయాణీ కులు తీవ్ర ఇబ్బందులు ఎదురకొంటున్నట్లు వారు తెలిపారు. కాబట్టి సంబంధిత ఆర్ టీ సీ అధికారులు దారి మల్లించి హిందూపురం నుంచి పీ. రొప్పాల కు వచ్చి రొద్దం పోయే విధంగా నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు. పీ రొప్పాలా నుండి రొద్దం మండల కేంద్రముకు చాలా గ్రామాల నుండి ఎంతో మంది ఎన్ని అవసరాల పై వెళు తుంటారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

# సొంత పంచాయతీ ప్రజలపై.....కమలాకర్ కరుణ.

.... వానవోలు సత్యసాయి వైద్య శిబిరంలో వందలాది మందికి అన్నదానం.

... టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం.

.... గత ప్రభుత్వ హయాంలో సొంత ఖర్చులతో.....స్థానిక జనానికి ట్యాంకర్లతో నీళ్లు, వందలాది మందికి కంటి వైద్య శిబిరం

..... దాత కమలాకర్ ను అభినందించిన... టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, నిమ్మల శ్రీధర్.





**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త** తెలుగుదేశం పార్టీ మండల యువ నాయకుడు బాచన్నపల్లి కమలాకర్ రాయల్ ఇటు రాజకీయంతో పాటు మరోవైపు సమాజసేవలో సైతం ప్రజలకు సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.గోరంట్ల మండలం వానవోలు పంచాయతీ కేంద్రంలో ప్రతినెల 7వ తేదీన శ్రీ సత్య సాయి బాబా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించే మొబైల్ వైద్య శిబిరానికి హాజరయ్యే వారికి గత ఏడాదిగా ప్రతినెల ఉచితంగా అన్నదానం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు కమలాకర్.గోరంట్ల మండలం వానవోలు గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన వారికి కమలాకర్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టిడిపి మండల సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్, పార్టీ జనతా పార్టీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, పార్టీ జిల్లా నాయకులు చిలమత్తూరి వెంకటేష్, సింగిల్ విండో అధ్యక్షులు పాయల రమణ తదితరుల చేతుల మీదుగా సత్యసాయి భక్తులకు మరియు వైద్య శిబిరానికి హాజరైన వారికి భోజనాలు పంపిణీ చేశారు. వానవోలు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో లకు నిర్వహిస్తున్న వైద్య సేవలను కూటమి నాయకులు పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు కమలాకర్ రాయల్ గత కొన్ని సంవత్సరాలుగా సొంతం పంచాయతీ ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నాడని రెండు సంవత్సరాలకు పైగా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా, మండల స్థాయిలో భారీ ఎత్తున ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుతోపాటు అనేక అన్నదాన కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కూటమి నాయకులు కమలాకర్ నుఅభినందించారు. కమలాకర్ ది వయసు చిన్నదైన సేవ చేయడంలో ఆయన మనసు చాలా పెద్దదని కొనియాడారు. ఎక్కడో కర్ణాటక ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటూ అక్కడ సంపాదించిన వాటిలో కొంత సొమ్మును సొంత ప్రాంత ప్రజలకు ఖర్చు చేస్తూ ఆత్మసంతృప్తి పొందుతున్నాడు కమలాకర్.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జిలాన్, బిజెపి నాయకులు వెంకటాచలం, హరీష్, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం వచ్చేవరకు మా పోరాటాలు ఆగవు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.



**ధర్మవరం సెప్టెంబర్ 07,సీమ వార్త ;** అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం వచ్చేంతవరకు మా పోరాటాలు ఆపము అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని గూడ్స్ షెడ్ కొట్టాలలో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేతన్న నేస్తం లో రాని వారి ఇండ్లకు వెళ్లి అసలు విషయాన్ని తెలుసుకోవడం జరిగింది. అనంతరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, నేతన్న నేస్తం 25 వేల రూపాయలు సగముకు పైగా అవకతవకలు జరిగాయని, ఇందుకు మా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయని తెలిపారు. నిజమైన నేతన్నలకు డబ్బు రాలేదని, ఎక్కడిది దొక్కాడని చేనేత కార్మికులను ఈ విధంగా మోసం చేయడం ప్రభుత్వానికి తగదు అని వారు హితవు పలికారు. అదేవిధంగా నారా లోకేష్ విద్యావ్యవస్థ పై అతి తెలివిని ఉపయోగించడం సరికాదని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అర్హులు లేనివారికి ఎలా ఇచ్చారని వారు ప్రశ్నించారు. అర్హులైన వారికి నేతన్న నేస్తం రాకపోవడానికి ఎవరైనా సరే అధికారులైన వదిలేది లేదని వారు మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. డీఎస్సీలో సిపిఐ విచారణ ఎందుకు చేయటం లేదని నారా లోకేష్ ను ప్రశ్నించారు. మా జగన్మోహన్ రెడ్డి హయాంలో ఏపీపీఎస్సీలో అవ్వక తవ్వకాలు జరిగిన వెంటనే సిబిఐ విచారణను చేపట్టమని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. మున్సిపల్, పంచాయతీ ఎలక్షన్స్ వస్తున్నాయని, దీని ద్వారా మరింత మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పంతోందని తెలిపారు. మున్సిపల్ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయం ఖాయమని తెలిపారు. ఇప్పటికే ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అయిందని, సమస్యలు పరిష్కారం కాక అలాగే ఉన్నాయని వారు ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో అన్ని సమస్యల పైన వైఎస్ఆర్సిపి పార్టీ పోరాటం చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డుఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బెస్ట్ టీచర్ అనసూయమ్మ కు... గోరంట్ల గురువుల బెస్ట్ విషెస్.



**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త.** మంత్రి సవితమ్మ సోదరులు నాగార్జున జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న సందర్భంగా అనసూయమ్మ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నిమ్మల శ్రీధర్ నివాసంలో సోమవారం రాత్రి తోటి ఉపాధ్యాయ బృందం అనసూయమ్మను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శాలువాలు కప్పి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల టీచర్స్ మురళి, కృష్ణ ప్రసాద్, నాగేష్, శివయ్య, నాగేంద్ర, రవికుమార్ క్రిష్టప్ప, శ్రీరాములు,పాల్గొనడం జరిగింది

## ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి:

ఎంపీడీవో అంజినప్ప



**నల్లమాడ: సెప్టెంబర్07 (సీమ వార్త):** కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లను మంజూరు కొరకు దరఖాస్తు స్వీకరణకు ప్రభుత్వం చేపట్టింది.ఈనెల 7వ తేదీ నుండి 16వ తేదీ వరకు మండలంలోని అన్ని స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డు కేంద్రాల్లో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను అధికారులు స్వీకరించనునట్లు నల్లమాడ ఎంపీడీవో అంజినప్ప ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. దీంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డ్,రేషన్ కార్డ్,ఆదాయ ధ్రువీకరణ పత్రం,సంబంధిత వైద్య ధ్రువీకరణ పత్రాలతో సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.అయితే అధికారులు దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేసి ఈకేవైసీ చేయడంతోపాటు అర్హతలను పరిశీలిస్తారని, అనంతరం అర్హత కలిగిన దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి భౌతికంగా పరిశీలన నిర్వహించి పత్రాలు అర్హతలను తనిఖీ చేస్తారన్నారు.కావున వృద్ధాప్య,వితంతువు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు,చేనేత కార్మికులు,మత్స్యకారులు, డప్పు కళాకారులు,తదితర అర్హత కలిగిన వర్గాల వారు నిర్ణిత గడువులోగా దరఖాస్తు చేసుకోని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## గోరంట్ల పురవీధుల్లో.... శ్రీకృష్ణుని విగ్రహ ఊరేగింపు.



**గోరంట్ల సెప్టెంబర్ 7 సీమ వార్త.**శ్రీకృష్ణ జన్మష్టమిని సందర్భంగా,,త్రాతసిద్దాంతం ,, ప్రబోధ సేవా సమితి వారి ఆధ్వర్యంలో గోరంట్ల ఓల్డ్ స్టేట్ బ్యాంకు నందు ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమను ఈరోజు అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.. భగవద్గీత జ్ఞనం ప్రతి మనిషి తెలిసి నడవాలని ,,గీత శ్లోకాలతో భక్తులు వీధులన్నీ కలియతిరిగారు..

## పులకుర్తిలో గుడి విషయంలో ఇరువర్గాల ఘర్షణ

...పులకుర్తిలో గుడి కలశం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

-- నలుగురికి గాయాలు, పోలీసు పికెట్ ఏర్పాటు



**డి.హీరేహాల్, సెప్టెంబర్ 7 సీమవార్త :** మండలంలోని పులకుర్తి గ్రామంలో మడివాల మాచిదేవ గుడి విషయంలో రజకులు, కురుబ కులస్తుల మధ్య ఉన్న వివాదం ఘర్షణకు దారితీసింది. గత కొంతకాలంగా ఇరువర్గాల మధ్య సివిల్ వివాదం కొనసాగుతూ, ఈ అంశంపై రాయదుర్గం కోర్టును ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో సోమవారం రజకులు గుడిపై కలశం ఏర్పాటు చేయగా, కోర్టులో వివాదం కొనసాగుతున్న సమయంలో కలశం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తూ కురుబ కులస్తులు దానిని తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో రజకులకు చెందిన ఇద్దరు, కురుబ కులస్తులకు చెందిన ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ, సర్కిల్ ఎస్సైలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన వారిని రాయదుర్గం, బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక పోలీసు బృందంతో పికెట్ ఏర్పాటు చేశారు.

## పేకాట స్థావరంపై రూరల్ పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్ట్, రూ.50 వేలు సీజ్

పేకాట ఆడినా.. నిర్వహించినా కఠిన చర్యలు తప్పవు - రూరల్ సీఐ



**తాడిపత్రి, సెప్టెంబర్ 7 సీమ వార్త:** తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెన్నా నది పంపు సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.50,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకొంటామని రూరల్ సీఐ నారాయణ రెడ్డి అన్నారు. అరెస్ట్ అయిన వారి వివరాలు:సల్లవాది కృష్ణ బాబు (27), జలిగల ఇషాక్ (20), కరూర్ నఫీజ్ అహ్మద్ (22), దొమ్మర నంద్యాల అజ్మత్ (24), మంజుల భరత్ కుమార్ (20), నంబాల భాస్కర్ (37)తాడిపత్రి రూరల్ పరిధిలో పేకాట, అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, పేకాట నిర్వహించే వారు, స్థలాలు సమకూర్చే వారు, పేకాట ఆడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ప్రజలు పేకాటకు దూరంగా ఉండాలని, అక్రమ జూద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## వెంకన్న సన్నిధిలో వి.ఆర్ రామిరెడ్డి ప్రత్యేక పూజలు



**తాడిపత్రి, సెప్టెంబర్ 7 సీమ వార్త:** పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని వి.ఆర్. రామిరెడ్డి దర్శించుకున్నారు.గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆలయ నిర్మాణం గ్రామానికి శుభసూచకమని, గ్రామస్తుల భక్తి భావం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ఆలయ ప్రతిష్టతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొందని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.ఆయన వెంట శంకర్ రెడ్డి, జూటూరు శంకర్ రెడ్డి, చెన్నారెడ్డి, దేవేందర్ ఆర్య, కురువ నడిపి ప్రసాద్, విష్ణు, శంకర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఈ పంట నమోదు 100% పూర్తి చేయాలి..!!

-మొదటిపేజీ తరువాయి



సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా మంచినీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాలు, ఏపీ మోడల్ స్కూల్స్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మరియు రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మరియు ప్లాంటేషన్ కార్యక్రమానికి సంబంధించి మీకు ఇచ్చిన టార్గెట్ నెల రోజుల లోపల పూర్తి చేయాలన్నారు. వి బి జి రామ్ జి పథకం ద్వారా జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించి జిల్లాకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. విబిజి రాంజీ పథకంలో ఎస్సీ ఎస్టీలకు 100% పనులు కల్పించాలన్నారు. ఐ గాట్ కర్మయోగి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు ప్రతి ఉద్యోగి ఐగాట్ కర్మయోగి కోర్సులు పూర్తి చేసే విధంగా సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో చాలా వరకు పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఈ విషయాన్ని అన్ని మండలాల మండల వ్యవసాయ శాఖ అధికారులు దృష్టిలో ఉంచుకొని రైతులు వేసిన ప్రతి పంట 100% ఈ పంట నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి సాలు రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి శైలజ, ఉద్యానవన శాఖ ఏడి ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన ప్రదాత-...అక్షర సేవకుడు నిత్య విద్యార్థి.

-మొదటిపేజీ తరువాయి



అద్భుత రికార్డులు -కోగిర బడి భగీరథుడుఉపాధ్యాయ వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాక, పరమ పవిత్రమైన దైవకార్యంగా భావించే చాంద్ బాషా తన 24 సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను దాటారు. 100 శాతం ఉత్తీర్ణత సాధన: - తాను పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిచ్చారు.

స్థల ఆక్రమణ తొలగింపు:-

కోగిర ఉన్నత పాఠశాల స్థలంలో ఆక్రమణకు గురైన గడ్డివాములను సహచర ఉపాధ్యాయుల తోడ్పాటుతో, నాటి డిఎస్పీ కోలార్ కృష్ణ సహకారంతో తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరచి బడికి కొత్త శోభ తెచ్చారు.

రూ. 96 లక్షలతో నూతన భవనం:-తీవ్రమైన గదుల కొరతతో ఇబ్బంది పడుతున్న కోగిర పాఠశాలకు, ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డీటి ఛైర్‌పర్సన్ మాంచో ఫేర్రర్ ను కలిసి, సమస్య తీవ్రతను వివరించి రూ. 96 లక్షల నిధులతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మింపజేశారు. సరస్వతి విగ్రహావిష్కరణ:- విద్యాలయ ప్రాంగణంలో 6 అడుగుల దివ్యమైన సరస్వతీ దేవి విగ్రహాన్ని నెలకొల్పి, సబ్ కలెక్టర్ మరియు డిఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

మాతృభాషపై మక్కువ -- అక్షర శిల్పిగా 'జాబిలి'

"జాబిలి చాంద్ బాషా" అనే ప్రసిద్ధ కలం పేరుతో తెలుగు, హిందీ భాషలలో కవితలు, కథలు, విమర్శ వ్యాసాలు రాస్తూ రసజ్ఞుల మనసులను గెలుచుకున్నారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడిగా, 'జాబిలి' తెలుగు మాసపత్రిక గౌరవ సంపాదకుడిగా భావితరాలకు సాహితీ వారసత్వాన్ని అందిస్తున్నారు.

రచించిన ప్రసిద్ధ గ్రంథాలు:-

మట్టిని ముద్దాడిన మనిషి,శాంతి పూలదేహం,ఇస్లాం ద పీస్,"బోధ్ధ" దీర్ఘ కావ్యం,గుల్ మొహర్ (సాహితీ విమర్శ వ్యాసాలు),ఈ దేశం నా దేహం దీర్ఘ కావ్యం. ఈయన రచనలలో మతసామరస్యం, మానవతా విలువలు, పర్యావరణ స్పృహ, దేశభక్తి ముఖ్యమైన సారాంశాలుగా కనిపిస్తాయి. 3. దేశభక్తి స్ఫూర్తి -- పర్యావరణ రక్షణ:- యువతలో మరియు విద్యార్థులలో జాతీయ భావాన్ని, పర్యావరణ పరిరక్షణ బాధ్యతను నింపడానికి ఆయన నిర్వహించిన కార్యక్రమాలు చిరస్మరణీయమైనవి.

1250 అడుగుల సుదీర్ఘ జాతీయ జెండా: 2012 నుండి ఇప్పటివరకు 10 సార్లు 1250 అడుగుల త్రివర్ణ పతాకాన్ని బహిరంగంగా ప్రదర్శించి పౌరులలో దేశభక్తి ఉప్పొంగేలా చేశారు.

జనగణమన లక్షగళార్చన:- 2018 లో పెనుకొండ కళాశాల మైదానంలో నాటి విద్యాశాఖ మంత్రి సహకారంతో 10,000 మంది విద్యార్థులతో జాతీయ గీత ఆలాపన (లక్షగళార్చన) నిర్వహించి సమైక్యతా స్ఫూర్తిని రగిలించారు.

వన సంరక్షణ:-

ప్రతి ఏటా విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కోగిర ప్రాంత అటవీ భూములలో, పాఠశాల ప్రాంగణంలో వేలాది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

4. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాల పంట

ఆయన చేసిన నిరంతర సేవలకు గాను అనేక ప్రతిష్టాత్మక అవార్డులు, పురస్కారాలు వరించాయి:

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం),సర్వేపల్లి రాధాకృష్ణన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు (మనం ఫౌండేషన్ - 2023),నేతాజీ సుభాష్ చంద్రబోస్ సమ్మాన్ - 2024 (డబ్ల్యూఏసీ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ),ఇండియన్ గురుస్ మరియు టీచర్ అవార్డు - 2021 (ఇంపాక్ట్ సంస్థ),ఎన్విరాన్మెంట్ హీరో - 2023 (వర్డ్ ఎగైనెస్ట్ కరప్షన్ పీపుల్ కౌన్సిల్),రాష్ట్రీయ ప్రతిష్టా పురస్కారం (వర్తీ వెల్నెస్ ఫౌండేషన్, లక్నో - 2023),మదర్ థెరీసా జాతీయ పురస్కారం (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - 2018),బెస్ట్ ఆర్గనైజర్ సన్మానం (75 ఏళ్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా సబ్ కలెక్టర్ చేతుల మీదుగా - 2022),ఇంటర్నేషనల్ పీస్ మెడల్ ఉ ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు - 2023,ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రశంసా పత్రం

ఉపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని నిలబెడుతూ, కవిగా సమాజానికి సన్మార్గాన్ని చూపిస్తూ, సేవాకర్తగా పచ్చదనాన్ని, పవిత్రతను పంచుతున్న జాబిలి చాంద్ బాషా జీవితం రేపటి తరానికి ఒక మార్గదర్శకం.

(రామాంజనేయులు బుట్టే. సీనియర్ జర్నలిస్ట్, పెనుకొండ ).

# బెస్ట్ యూనివర్సిటీ లో....పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం.











**విద్యార్థుల కోసం యూనివర్సిటీలో విలువైన కార్యక్రమం.**

**వృత్తి మార్గాలకు అతీతంగా అవకాశాలపై అన్వేషించాలి.**

**గోరంట్ల, సెప్టెంబర్ 7 సీమ వార్త.** విద్యార్థులలో వ్యవస్థాపకత, ఆవిష్కరణ, నాయకత్వం మరియు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో, గోరంట్లలోని భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ లో సెప్టెంబర్ 7 నుండి 11, 2026 వరకు ఒక పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించ బడుతోంది. ప్రపంచ బ్యాంకు సహకారంతో, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ , అనంతపురం అమలు చేసే ఏజెన్సీగా వ్యవహరిస్తున్న రైజ్‌అప్ ఎంఎస్ఎంఈ ఐ రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ కింద ఈ ఐదు రోజుల కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశిష్ట అతిథులు, విశ్వవిద్యాలయ నాయకత్వం, అధ్యాపక బృందం మరియు వ్యవసాయ విభాగానికి చెందిన 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఆర్. హఫీజ్ బాషా సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ఆయన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులలో వ్యవస్థాపక దృక్పథాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. విద్యార్థులు వర్ధమాన అవకాశాలను గుర్తించి, వినూత్న ఆలోచనలను ఆచరణీయమైన సంస్థలుగా మార్చి, ఉపాధి కల్పన మరియు ఆర్థికాభివృద్ధికి దోహదపడాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. అనంత పురంలోని ఇంక్యుబేషన్ విభాగాధిపతి డాక్టర్ షేక్ సల్మాన్ అష్రఫ్ కూడా సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను విజయవంతమైన సంస్థలుగా మార్చుకోవడంలో ఇంక్యుబేషన్, ఆవిష్కరణ, మార్గదర్శకత్వం మరియు సంస్థాగత మద్దతు పోషించే పాత్ర గురించి మాట్లాడారు.

బెస్టియు డీన్ -- అకడమిక్స్ డాక్టర్ రామ్‌గోపాల్ మోపూరి ప్రారంభోపన్యాసం చేస్తూ, ఈఎస్‌డిపి యొక్క లక్ష్యాలు మరియు ప్రాముఖ్యతను వివరించారు. వ్యవస్థాపకత మరియు నైపుణ్యాభివృద్ధి సమకాలీన ఉన్నత విద్యలో ముఖ్యమైన అంశాలని ఆయన నొక్కిచెప్పారు మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, సంప్రదాయ వృత్తి మార్గాలకు అతీతంగా అవకాశాలను అన్వేషించాలని ప్రోత్సహించారు. బెస్ట్‌ఐయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగజ్యోతి గారు ఈ చొరవను ప్రశంసించి, విద్యార్థుల కోసం ఇంత విలువైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహక బృందాన్ని అభినందించారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి మరియు పరిశ్రమ ఆధారిత అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని ఆమె నొక్కి చెప్పారు.

బెస్ట్‌ఐయూ ఛైర్మన్ భరత్ లాల్ మీనా మరియు బెస్ట్‌ఐయూ ఛాన్సలర్ డాక్టర్ రూప వాసుదేవన్, నిర్వాహక బృందం యొక్క కృషిని అభినందించారు. అంతేకాకుండా, విద్యార్థులకు వ్యవస్థాపకత, ఆవిష్కరణ, ఇంక్యుబేషన్ మరియు వర్ధమాన వ్యాపార అవకాశాలపై ఆచరణాత్మక అవగాహన కల్పించే కార్యక్రమాలకు తమ మద్దతును తెలిపారు. డీన్ డాక్టర్ వందన, వ్యవసాయ విభాగాల అధ్యాపకులు మరియు విద్యార్థులతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. 200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం, వ్యవస్థాపకత మరియు నైపుణ్య ఆధారిత అభ్యాసం పట్ల విద్యార్థి సమాజంలో పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబించింది. ఐదు రోజుల పాటు జరిగే ఈఎస్‌డిపి కార్యక్రమంలో పాల్గొనేవారికి వ్యవస్థాపక అవకాశాలు, ఆలోచనల ఆవిష్కరణ, నూతనత్వం, వ్యాపార ప్రణాళిక, స్టార్టప్ అభివృద్ధి, ఆర్థిక అవగాహన, మార్కెట్ పరిజ్ఞానం, ఇంక్యుబేషన్ మద్దతు మరియు అవసరమైన వ్యవస్థాపక నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి మరియు వ్యవస్థాపకతను ఒక అర్థవంతమైన వృత్తి ఎంపికగా అన్వేషించడానికి సాధికారత పొందుతారని ఆశిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పరిశ్రమ నిపుణులు, ఇంక్యుబేషన్ నెట్‌వర్క్‌లు మరియు రంగంలోని వర్ధమాన అవకాశాలతో విద్యార్థులను అనుసంధానిస్తూ, ఆవిష్కరణ, వ్యవస్థాపకత, ఉపాధి కల్పన మరియు స్టార్టప్ సంస్కృతిని పెంపొందించే ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించే దిశగా బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ తీసుకున్న మరో ముఖ్యమైన ముందడుగు అవకాశమని అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# మజ్లీస్‌తో రేవంత్ సంబంధం





**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. "రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను" అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది. అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. "నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు" అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్-ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.